# ఆపద మొక్కుల ఆసామి

కమల మనసు ఆనందంతో ఊగిపోతోంది. ఎన్నాళ్లగానో లోలోపల చిన్న జల మాదిరిగా ఉండి, ఉన్నట్టుండి పలుగుదెబ్బకి పైకిలేచి ఆకాశానికంటిన జలధారలా ఆమె సంతోషం పట్టలేకుండా ఉంది.

నూతనోత్సాహంతో అన్ని పనులు ఒక్క చేతిమీద చకచకా చేసి పారేస్తోంది. అలసటన్నదే లేనట్టుగా బొంగరంలా గిరగిరా తిరిగి, పదేళ్ళ వయసు వెనక్కి వెళ్లినట్టు పరుగులు పెట్టేస్తోంది.

కమల చిన్నతనంలో అమెరికా గురించి పుస్తకాల్లో చదవడం, మ్యాపులో చూడటమే గానీ, ఆ దేశం మీద పెద్దగా వ్యామోహం ఏమీ ఉండేది కాదు. ప్రత్యేకించి అమెరికా వెళ్లాలనీ, చూడాలనీ ఉవ్విళ్లూరడమూ ఉండేది కాదు. కాని ఆమె పెళ్లయి, సంసార జీవితంలో పడిపోయిన ఈ పాతికేళ్లలోనూ అమెరికా అనే భూతల స్వర్గం గురించి వార్తలు, వింతలు, విశేషాలు గొప్ప మోజులో పడేశాయి.

ప్రతీ కుటుంబానికి కాస్త దగ్గరవాళ్లో, దూరం వాళ్లో ఎవరో ఒకరు ఆంధ్ర దేశం నుండి అమెరికా వెళ్లడం, స్థిరపడడం, అపుడపుడీ దేశం రావడం, వస్తూ వాళ్లతో బాటు బోలెడు వింతలు, విడ్డూరాలు, విలాసాలు, సంపదలు, డబ్బు, నగలు, బట్టలు తీసుకొచ్చి చూపించడం ఒక ఆనవాయితీ అయింది. కొందరు దగ్గర బంధువులకి అమెరికా నుండి చిన్న చిన్న బహుమానాలు తెచ్చి ఇవ్వడం, వాళ్ళవి అపురూపంగా అందరికీ చూపించుకోవడం సర్వసాధారణమైపోయింది.

చిన్న చిన్న ఎలక్ట్రానిక్ వస్తువులు, పెద్ద పెద్ద షర్టులు, విచిత్రమైన టోపీలు, ఆశ్చర్యం కలిగించే పెన్నులు, చేతిలో ఇమిడిపోయే రేడియోలు, వాటిలోనే టార్చ్‌లైట్లు ఇలా, ఎన్నో – దేశంలోనే ఉండిపోయిన వాళ్లకి ఒక్కసారి అమెరికా వెళ్ళి రావాలనే తీవ్రమైన కోరికను కలిగిస్తూ ఉంటాయి. కమల అదృష్టమో దురదృష్టమో గానీ అమెకి దగ్గరగా ఉన్న కుటుంబాలలో ఎవరూ అమెరికా వెళ్లలేదు. అందుకే ఇది – అమెరికా నుంచి మా పలానా వాళ్ళు తెచ్చిచ్చారని గర్వంగా చెప్పుకునే సందర్భం ఇంతవరకు

ఆమెకు రాలేదు. ఈ మధ్య కమలకీ విషయంలో కొంత చిన్నతనంగా అనిపిస్తోంది. అందరికంటే తాము తక్కువ స్థాయిలో ఉన్నామనే భావం కూడా అపుడపుడు బాధించడం మొదలైంది. ఇపుడు ఇన్నాళ్లకి తనలో ఉన్న ఈ బాధ తీరే అవకాశం తళుక్కున మెరిస్తూ సుదూరంగా కనిపిస్తోంది.

మొన్నీ మధ్యనే కమల చిట్టచివరి మరిది శంకర్‌కి పెళ్లయింది. ఆ మరిదికున్న ఏకైక బావమరిది అమెరికాలో ఉంటున్నాడు. కొత్తకోడలుగా వచ్చిన తోడికోడలు నీరజ చనువుగా కమల వెంట అక్కా, అక్కా అంటూ తిరుగుతూ వాళ్ల అన్నయ్య విశేషాలు చెప్తుంటే కమల ఒళ్లు మరచి వినడం సహజమైపోయింది. చెల్లెలి పెళ్లయిన ఆరునెలలకి ఇండియా వస్తున్న బావమరిది భానుమూర్తికి మొత్తం కుటుంబం హారతులు పట్టడానికి సంసిద్ధంగా ఉంది.

ఆ ఇంటి పెద్ద దిక్కు – కమల మొగుడు కామేశ్వర్రావు. ఆడదిక్కు కమలే. కారణం శంకరం ఆరేళ్ల పిల్లాడుగా ఉన్నపుడే అతని తల్లి పోయింది. అందుకే కమల సమయం దొరికినప్పుడల్లా 'శంకరం నా చేతుల మీద పెరిగాడు'' అంటూ పెద్దరికాన్ని వ్యక్తం చేస్తుంటుంది. అటు నీరజకు తల్లిలేదు. భానుమూర్తి నీరజను దగ్గర పెట్టుకుని సాకక పోయినా డబ్బు సమకూర్చి చెల్లెలి పెళ్లి ఏలోటూ లేకుండా చేశాడు. అందుకు నీరజకు అన్నయ్య అంటే దైవం. శంకరానికి వదిన మరీ దేవత కాదుగానీ దేవతలాంటిది. ఈ కారణాలన్నీ క్రోడీకరించుకుని చూస్తే కమలకి అమెరికాలో ఉన్న దగ్గర చుట్ట మొకరు దొరికినట్టేననిపించి, బ్రహ్మానందపడిపోవడం మొదలుపెట్టింది.

అందుకే తెల్లారి లేచింది మొదలు, ఆరోజు రాబోయే భానుమూర్తికి ఏవేవి ఇష్టమో, అవి ఎంతెంత ఇష్టమో నీరజ ద్వారా తెలుసుకుని ఒక్కొక్కటే చెయ్యడాన్కికి ప్రయత్నాలు మొదలు పెట్టింది. అమెరికాలాంటి దూరదేశాలలో స్థిరపడినా మాతృదేశం, మాతృభాష, సంప్రదాయం, సదాచారం, విష్ణుసహస్రాలు, వెంకటేశ్వర సుప్రభాతాలు, మనదేవుళ్లూ లాంటి భావాలు మరీ ఎక్కువైపోయి సెంటిమెంటల్‌గా తయారవుతారు. అందులో ముఖ్యమైనవి చిన్నప్పుడు అమ్మచేసిన చింతకాయ పచ్చడి నుంచి తాతగారి తద్దినానికి చేసిన గారెలు, అల్లప్పచ్చడీలాంటివి మరీ నాలుక పీకేస్తూ ఉంటాయి.

మరింక చెప్పేదేముంది కమల కొరివికారం, గోంగూర పచ్చడి, నువ్వు పప్పు పొడి, కందిపొడి, అల్లప్పచ్చడి, ఉసిరి ఆవకాయలాంటివి రెండురోజులుగా చేసి, రెడీ

గా పెట్టింది. ఆరోజు భోజనానికి ఏవేవో పాతకాలపు కూరలు మర్చిపోయిన రుచులు, ఆవళ్లూ, అప్పాలు అంటూ తంటాలు పడిపోయింది.

నిజానికివన్నీ ఈ దేశంలో ఉన్నవాళ్లే అంతగా లొట్టలేసుకుంటూ తినరు. దొరకదంటేనే దానిమీద విపరీతమైన మోజు మరి.

అనుకున్న ప్రకారం భానుమూర్తి కుటుంబంతో వచ్చాడు. అయితే అతను ఇండియా వచ్చి అప్పటికే పదిహేను రోజులయింది. అతని భార్యవైపు వారిళ్లల్లో మకాములు, మర్యాదలు అన్నీ జరిగేపోయాయి.

కమల ఊహలు కొంత దెబ్బతిన్నాయి. తన తోడికోడలు నీరజ భానుమూర్తికి సొంత చెల్లెలయినా దిగుతూనే అతనక్కడికి వస్తాడనుకోవడంలో తొందరపడిందనే అనుకోవాలి. ఏమైనా ఆమె మరీ నిరుత్సాహపడిపోలేదు. నిజమే మరి, భార్యవైపు తల్లీ తండ్రీ అన్నలు అందరూ ఉండగా అటువెళ్లడమే సబబని సరిపెట్టేసుకుంది.

అన్నయ్యని చూసి నీరజ మహదానందపడిపోయింది. అతను తెచ్చిన ఏవేవో చిన్న చిన్న బహుమానాలు చూసుకుని, నలుగురికి చూపించుకుని మురిసిపోయింది.

భానుమూర్తికి చెల్లెలితో ఎంత అనుబంధమున్నా, ఆమెకి కొత్తగా పెళ్లయిన అత్త వారితో బొత్తిగా పరిచయం లేదు. పైగా కమల తోడికోడలు హోదాలో ఎంత కలుపు గోలుగా ఉన్నా అది కొంతవరకే సాగింది.

పొద్దున్న పదిగంటలకి వచ్చినవాళ్లు సాయంత్రం ఆరుగంటలకి బయలుదేరి పోయారు. 'ఇంకా చాలామందిని చూడాలి' అంటూ -

పరిచయం లేకపోవడం వల్ల కమలకేమీ బహుమానం ఇచ్చేందుకు తేనూ లేదు. అప్పటికే చాలా వస్తువులు సర్దుబాట్లయిపోవడం వల్ల మాట్లాడ కూరుకున్నారు. నీరజ కూడా తనకి తెచ్చిన వస్తువుల్లో ఏ ఒక్కటీ కమలకి త్యాగం చెయ్యలేకపోయింది.

శంకరం అన్నగా, ఇంటికి పెద్దగా, కమల మొగుడిగా కామేశ్వర్రావు కావలసి నంత హడావిడి చేసి, భానుమూర్తిని ఒక్క క్షణం వదల్లేదు. అతని చేత అమెరికా గురించి పూసగుచ్చినట్టు చెప్పించుకుని మరీ ఆనందించాడు.

భానుమూర్తి భార్య ఈ పచ్చళ్లు, పొళ్లు ఏమీ వద్దని అన్నీ వాళ్లమ్మ ఇచ్చిందనీ, ప్యాక్ చేసి పెట్టేశారని సున్నితంగా నచ్చ చెప్పింది. కమల మరీ మొహమాట పెట్టబోతే, మాకు వెయిట్ సమస్యకూడా ఉందని తేల్చింది.

''ఏమిటీ నీ చాదస్తం. వాళ్ల వెళ్లేది అమెరికాగానీ అంతర్వేది కాదు'' అంటూ ముత్యాల ముగ్గు డైలాగ్ కొట్టి అందర్నీ అలరించాడు కామేశ్వర్రావు.

భానుమూర్తి వెళ్తూ కామేశ్వర్రావు చేతిలో ఒక పొడుగాటి ప్యాకెట్ కాస్త రహస్యంగా పెట్టి, చెవిలో ఏదో గుసగుస జోకులు చెప్పి, నవ్వుతూ నవ్విస్తూ గుమ్మం దాటాడు.

అంతవరకు ఉన్న నిరుత్సాహం ఒక్కసారిగా కమలలో పటాపంచలమై పోయింది. ఇంటికి మగాడు కదా ! ఏదైనా బహుమతి ఆయన చేతిలో పెట్టడమే సహజం. ఆడవాళ్లు, ఓ పక్కగా ఉండటమేగా అని అత్యంత సహజంగా మొత్తంగా సమర్ధించేసుకుని ఊపిరి పీల్చుకుంది. ఆ రాత్రి కామేశ్వర్రావు అందమైన ఆ ప్యాకెట్ విప్పి బ్రహ్మానంద పడి పోయాడు. కమల అది చూస్తూనే అవాక్కయిపోయింది.

దానిమీద Chivas Regal Premium Scotch Whisky అని అందమైన బంగారు రంగు అక్షరాలు మెరుస్తున్నాయి. విస్కీ అంటే ఎంత అసహ్యమున్నా, అపురూపంగా కనిపిస్తున్న అందమైన ఆ సీసా చూసి ముచ్చటపడకుండా ఉండలేక పోయిందో క్షణం.

''ఇదిగో చూడు నువ్వో అడవిమాలోకానివి. యాభైలలో పడేవారు రోజూ ఒక్క పెగ్గు వేసుకుని పడుకోవడం అన్నివిధాలా ఆరోగ్యానికి ముఖ్యం. ఆహా ఇన్నాళ్లకి నా చిరకాల వాంఛ తీరింది'' అంటూ మురిసిపోయాడు. ఆ రాత్రి సొంతంగా ఇన్ని పకోడీలు, చిప్స్ తెచ్చిపెట్టుకుని తలుపేసుకుని మందు పట్టించి మైమరచాడు కామేశ్వర్రావు. ఇండియాలో ఉన్నంత మాత్రాన 'మందు' అనేది తెలీనంత మంద భాగ్యుడు కాదతను. కానీ ఈ విధంగా ఇంట్లో బుడ్డీ తెరిచే సాహసం చెయ్యలేదు. ఇది ఫారిన్ సరుకు. పైగా డైరక్ట్‌గా ఫారిన్ నుండి బావగారి వరసవాడు భారీగా ఇచ్చిన కానుక.

★ ★ ★ ★

నాలుగు రోజులు కామేశ్వర్రావు ఇంట్లో ఈ విధమైన ఆనందం పొందాడు. దీన్నెలా నిరోధించాలో కమలకి అర్థం కాలేదు. అమెరికాలో రాత్రిళ్ళు విస్కీ తాగి పడుకోవాల్సిన అవసరం ఉందేమోగానీ, మన ఇండియాలో లేకితనం వల్ల, వ్యసనంగా తాగాలేగానీ, దాని అవసరమేమీ లేదని కమలకి అనిపించింది.

వారం రోజులు గడవగానే కామేశ్వర్రావు మందు ఖాళీ అయింది. ప్రయాణాల్లో మంచి నీళ్లు పట్టుకెళ్ళవచ్చని ఖాళీ సీసా కమలకి ఉదారంగా ఇచ్చేసి, మళ్లీ మందెప్పుడొస్తుందా అని ఎదురు చూడ్డం మొదలు పెట్టాడు.

పదిహేను రోజుల తర్వాత అమెరికా వెళ్లిపోతున్న వరుస బావమరిది మిగిలి పోయిన మరో సీసా మిత్రుల ద్వారా పంపించి తన గొప్పతనం చాటుకున్నాడు.

'ఏమిటీ పాడుగోల' అంటూ విసుక్కుంది కమల.

''మంచిదానివే ! ఇదెంత ఖరీదో తెలుసా. అయిదువేలు ! నామీద అభిమానం కొద్దీ ఆయన నాకిచ్చాడు గానీ లేకుంటే బోలెడుమంది ఉంటారు ఎగరేసుకు పోవడానికి'' అంటూ డప్పాలు కొట్టాడు.

ఫారిన్ విస్కీ మహరుచిగా ఉంటుందని కామేశ్వర్రావు తరుచూ నలుగురూ కూచున్నపుడు అలరిస్తుండేవాడు.

ఓ ఆర్నెల్లు గడిచాక వరుస బావమరిది, అతని బావమరిది ఇండియా వస్తుంటే చిన్న చిన్న కానుకలు పంపాడు. అందులో కూడా కమలకి స్థానం లేకపోయింది. నీరజకి ఒక సెంటు, పౌడరు, నగీషీల దువ్వెన, మరిది శంకరంకి ఒక ఎలక్ట్రిక్ షేవింగ్ మిషన్, ఒక పోకట్ కాలిక్యులేటర్ పంపుతూ, కామేశ్వర్రావుకి ప్రీతిపాత్రమైన షివాస్ రీగల్ ప్రీమియమ్ స్కాచ్ విస్కీ పంపాడు, అది చూసి కమల అగ్గిమీద గుగ్గిలమైంది. కానీ కామేశ్వర్రావు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

అప్పట్నించి కామేశ్వర్రావుకి మంచి మంచి మందుసీసాలు అమెరికా నించి సరఫరా అవుతూ ఉన్నాయి. మధ్య మధ్య గ్యాపులలో అతను స్వయం కృషితో భర్తీ చేసుకుంటూ కాలక్షేపం చేస్తూ ఎవరేనా మందు మాట ఎత్తితే మైమరిచి పరుగెత్తే స్థితికి వచ్చాడు.

కమలకి ఒక్క చిన్న అపురూపమైన బహుమానం రాకపోగా, భర్తని పట్టుకున్న మందు దయ్యం ఆమెని భయపెట్టింది. ఆమె కనిపించిన ప్రతీ దేవుడికి మొక్కింది. ఈ ఆపద నుండి తప్పించమని, తిరుపతి వెంకన్న, సింహాచలం అప్పన్న, బెజవాడ కనకదుర్గ, మంగళగిరి పానకాల స్వామి – ఇలా అందర్నీ మొక్కి మొక్కి ఫలితం కనిపించక విసిగిపోయింది.

చివరికి అమెరికా నుంచి దిగుమతి అయ్యే బాధను అర్థం చేసుకునే దేవుడెవరా అనే ఆలోచనలో పడింది. మెరుపు మెరిసినట్టుగా ఆలోచన వచ్చింది వెంటనే 'ఓ పిట్స్ బర్గ్ వెంకటేశ్వర స్వామీ! అమెరికాలో స్థిరబడిన మా భారతీయులు ఈ దేశం వచ్చేప్పుడు ఇక్కడున్న మా వాళ్లకి ఈ విస్కీ సీసాలు తెచ్చే పాడు అలవాటు మాన్పించు తండ్రీ ! నువ్వలాచేస్తే వచ్చి నీ దర్శనం చేసుకుంటాను' అనేసి, చటుక్కున నాలుక్కరచుకుంది.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
22-6-1998